
# తోడు

— కోరాడ వెంకట చలపతిరావు



పొద్దు వాలిపోతున్నది.

కొద్దిగా వంగిన నడుముమీద ఎడంచెయ్యి ఆనించుకొని కుడిచేత్తో స్టీలు టిఫిన్‌ను భారంగా మోస్తూ మెల్లగా వంటగదిలోకి వచ్చింది వర్ధనమ్మ. పీట వాల్చుకుని శనగపిండి జల్లిస్తూ కూర్చుంది.

"బామ్మా! ఏం చేస్తున్నావ్?" ఆరేళ్ళ మనవడు పరుగు పరుగున వచ్చి వర్ధనమ్మ మెడచుట్టూ చేతులు వేసి వీపుమీద ఉయ్యాల ఊగుతూ అన్నాడు.

"రేపు మీరు ఊరికి వెళ్ళిపోతున్నారు కదా? నీకిష్టమని లడ్డూలు చేస్తున్నాను. వెళ్ళేటప్పుడు డబ్బాలో పెట్టిస్తాను. ఎంచక్కా మీరంతా కల్సి నాలుగు రోజులు దాచుకొని తినండి" అంది వర్ధనమ్మ మనవడి వంక మురిపెంగా చూస్తూ.

"ఛీ! పాడు శలవలు అప్పుడే అయిపోయాయి. బామ్మా! బామ్మా! నాకిక్కడే బాగుందే. నేనిక్కడే ఉండిపోతాను. మమ్మీ, డాడీకి చెప్పవే నన్నిక్కడే ఉంచమని..." బామ్మను ప్రాధేయపడుతూ అన్నాడు రవి.

మనవడి ఆప్యాయత వర్ధనమ్మ మనసును కరిగించింది. "నీకు ఉండాలని ఉన్నా నాకు ఉంచుకోవాలని ఉన్నా మీ అమ్మా, నాన్నా ఒప్పుకోవద్దురా. ఈ పల్లెటూరి చదువు, ఇక్కడి వాతావరణం వాళ్ళకు నచ్చదు. బస్తీ జీవితాలకు అలవాటుపడ్డారు వాళ్ళు. నేనేమన్నా పిల్లల్ని పాడుచేస్తున్నానని అంటారు" నిర్లిప్తంగా అంది వర్ధనమ్మ.

"పోనీ నువ్వే మాతో వచ్చేయి బామ్మా! ఎంచక్కా రోజూ తినటానికి అవీఇవీ చేసిపెడతావు. మంచి మంచి కథలు చెబుతావు. నీకు ఓపికలేకుంటే ఇవేవీ చేయకపోయినా ఫరవాలేదు. ఒట్టిగా కూర్చో చాలు. నువ్వు మాత్రం మాతోనే ఉండు బామ్మా!"

"నాకూ అంతా కలిసే ఉండాలని ఉంటుందిరా. కానీ ఈ ఇల్లు, ఈ ఊరు వదిలిపెట్టి రాబుద్ధిగాదు. ఇక్కడ తప్ప నేను వేరే చోట ఉండలేనురా" అంది వర్ధనమ్మ.

"నువ్వెప్పుడూ ఇంతే. నీతో మాట్లాడను పో. నువ్వు చేసిన లడ్డూలు కూడా తినను" అని బుంగమూతి పెట్టుకొని బయటకు తుర్రుమన్నాడు రవి.

తల్లి అన్న మాటలు అటుగా వచ్చిన కొడుకు పార్థసారధి చెవిలోపడ్డాయి.

"అమ్మా! నీ పట్టుదలే నీదిగానీ మా మాట వినిపించుకోవు కదా! ఈ వయసులో ఇలా ఒంటరిగా ఇక్కడ ఉంటే లోకం ఏమనుకుంటుంది? కొడుకు ఉండీ తల్లిని పట్టించుకోవటంలేదని నన్ను ఆడిపోసుకుంటుంది. అయినా ఈ పాత ఇంట్లో ఏముందని? నువ్వు కూడా మాతో వచ్చేస్తే ఈ ఇల్లు అమ్మేయవచ్చుకదా?" అన్నాడు కాస్త చిరాకు, అసహనం గొంతులో ప్రతిధ్వనిస్తుండగా.

కొడుకు మాటలు వర్ధనమ్మకు కష్టం కలిగించాయి.

"ఈ ఇంట్లో పుట్టి ఈ ఇంట్లో పెరిగి పెద్దవాడివైనావు. అయినా ఇప్పుడు బస్తీ వాతావరణానికి అలవాటుపడి ఈ ఇంట్లో ఏముందని ప్రశ్నిస్తున్నావు. కానీ నాకు సర్వస్వం ఈ ఇంట్లోనే ఉందిరా. నలభై ఏళ్ళు మీ నాన్నతో కలిసి కాపురం చేసిన తియ్యటి జ్ఞాపకాలున్నాయి. మీరు పారాడుతూ, తప్పటడుగులు వేస్తూ ఈ ఇంట్లో మసలిన మరిచిపోని అనుభవాలున్నాయి. ఇంతకన్నా ఏం కావాలిరా? ఈ ఇంట్లో ప్రతిగది, కిటికీ నన్నెంతో ఆప్యాయంగా పలకరిస్తుంటాయి. ఏ ముహూర్తంలో ఈ ఇంట్లో అడుగు పెట్టానో గానీ జన్మజన్మల అనుబంధం ఏదో నాకు ఈ ఇంటిలో ముడి పడిపోయినట్లు అనిపిస్తుంది. నేను ఒంటరిగా ఉన్నానని నువ్వేం బాధపడకు. ఈ ఇంట్లోని ప్రతి అంగుళంలో మీనాన్నగారి ఆత్మ నాకు కనిపిస్తూనే ఉంటుంది. ఈ ఇంట్లో నేను గడిపిన నలభై ఏళ్ళ జీవితాన్ని నెమరు వేసుకుంటూ చాలా హాయిగా, తృప్తిగా బ్రతుకుతున్నాను. నన్ను గురించి నువ్వేం ఆలోచించకు. నేను నిన్ను కోరేదల్లా ఒక్కటే. నేను బ్రతికి ఉన్నంతవరకు ఈ ఇంటిని అమ్మాలన్న ఆలోచన మాత్రం పెట్టుకోకు." అంది వర్ధనమ్మ.

తల్లి మాటల్లోని నిశ్చయం తెలుసుకున్న తర్వాత ఇంకేం మాట్లాడలేక పోయాడు పార్థసారధి. తను అలా అడగడం, ఆమె అలా సమాధానం చెప్పటం ఈరోజు కొత్తేంకాదు. శలవులకు ఇక్కడికి వచ్చినప్పుడల్లా వెళ్ళేముందు ఈ సంభాషణ ఇలాగే నడుస్తుంది. నిజానికి పార్థసారధికి ఎండాకాలం శలవుల్లో కూడా ఆ ఊరు రావటం ఇష్టం ఉండదు. ఫ్రిజ్, ఎయిర్ కూలర్, టి.వి. వీటన్నింటికీ అలవాటు పడిన ప్రాణాలు అవిలేకుండా ఆ ఊళ్ళో ఉండనని మొరాయిస్తుంటాయి. అయినా శలవుల్లోనయినా తల్లిని చూడటానికి రావటంలేదని లోకం అనుకుంటుందని వస్తాడు. వచ్చినప్పటినుండి వెళ్ళేంతవరకు 'నువ్వే అక్కడికి ఎందుకు రాకూడదు? మేమేవచ్చి ఇక్కడ ఉండాలంటే కుదరదు. మాకెన్నో పనులుంటాయి' అని రుసరుసలాడుతాడు. కోడలు మనసులో ఏముంటుందో ఏమోగానీ పైకి మాత్రం తటస్థంగా ఉంటుంది. ఆమె ఏ పని చేసినా, ఏం మాట్లాడినా 'బాధ్యత తప్పదు! అన్న భావం మాత్రం అడపా దడపా తొంగి చూస్తుంటుంది.

ఎవరు ఏమనుకున్నా, ఎవరి ఇష్టాయిష్టాలు ఏమైనా 'ఈ జీవిత పయనం' మాత్రం ఆగదు. ఆఖరి మజిలీ చేరేవరకు ఆ ప్రయాణం అలాసాగుతూనే ఉంటుంది.

* * *

నిశ్శబ్దంగా ఉన్న ఇంట్లో ఒక్కతే ఓమూల కూర్చుని 'రామకోటి' వ్రాసుకుంటున్నది వర్ధనమ్మ. పదిరోజుల నుండీ పిల్లల ఆటలు, అల్లరితో సందడిగా ఉన్న ఇల్లు ఇప్పుడు బావురుమంటూ ఉంది. ఉదయం నుండీ పిచ్చిదానిలా ఇల్లంతా తిరిగింది వర్ధనమ్మ. కాళ్ళునొప్పే తప్ప ఏం చేయాలో తోచలేదు. ఈ పదిరోజుల నుండీ చేతినిండా పనుండేది. పిల్లలకు ఏదో చేసిపెట్టాలి. వాళ్ళకు జడలేసి పూలు పెట్టాలి... కుట్లు, గుండీలు ఊడిన వాళ్ళ చొక్కాలకు, గౌన్లకు తిరిగి కుట్లు వేసి గుండీలు కుట్టాలి. ఇలాంటివే ఇంకా ఎన్నో పన్లు. పన్లన్నీ తీరాక వాళ్ళ ముద్దుముద్దు మాటలు వింటూ, వాళ్ళతో కబుర్లు చెబుతూ తనూ పదేళ్ళ పాపగా మారిపోయేది. ఇప్పుడు అంతా నిశ్శబ్దం తప్ప మరేమీ మిగల లేదు.

"వర్ధనమ్మా! ఏం చేస్తున్నావ్? పిల్లలంతా వెళ్ళిపోయినట్లున్నారు. ఇల్లంతా బోసిగా ఉంది." అన్న మాటలకు తృళ్ళిపడి తన ఆలోచనలో నుండి బయటకు వచ్చింది వర్ధనమ్మ. ఎదురుగా నెరసిన జుట్టు, పత్తార్వం కళ్ళజోడు, ధోవతి కట్టు, చేతిలో పన్ను కర్రతో కొద్దిగా వంగిన ఆరడుగుల ఆకారం కనిపించగానే "మీరా! రండి! కూర్చోండి!" అని చెక్క కుర్చీ అటు జరిపింది ఆమె. ఆ వచ్చింది

వాడికి నీ పట్ల కొన్ని బాధ్యతలున్నాయి. అలాగే కొన్ని హక్కులూ ఉన్నాయి. ఈలోకానికి కావలసింది అదే. మనసు నిండా అభిమానం ఉన్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి నాది. ఏ చుట్టరికం ఉందని, నీకు నేనే మవుతానని నీ బాధ్యత నామీద వేసుకోను. అందుకే నీ కొడుకు వెంట వెళ్ళి అక్కడ కొన్ని రోజులు ఉండు. ఆరోగ్యం కుదుట పడ్డాక మళ్ళీ ఇక్కడికే రావచ్చు. నువ్వు మొండిపట్టు పట్టి వెళ్ళకుంటే నీ కొడుకన్నట్లు 'తల్లిని పట్టించుకోలేదని 'వాణ్ని లోకం నిందిస్తుంది'' వర్ధనమ్మకు నచ్చచెప్పే ధోరణిలో అన్నారు భానుమూర్తిగారు. వర్ధనమ్మ ఏమీ మాట్లాడలేదు. ఏవేవో ఆలోచనలు! గతం సినిమా రీలులా ఆమె మెదడులో గిర్రున తిరిగింది. చనిపోయిన భర్త గుర్తుకు వచ్చాడు. రెక్కలొచ్చి ఎగిరిపోయిన పిల్లలు కళ్ళముందు మెదిలారు. పదమూడేళ్ళ పిల్లగా ఉన్నప్పుడు ఆ ఇంట్లో అడుగు పెట్టింది. అప్పటినుండీ ఆ ఇల్లే తన ప్రపంచం అయింది. బయటి ప్రపంచం ఎల్లా ఉంటుందో చూడాలన్న ఆసక్తి కూడా తనకెందుకో ఏనాడూ కలగలేదు. ఇప్పుడు ఎక్కడికో... కొత్త చోటుకి... అంతదూరానికి వెళ్ళి ప్రాణం విడవాలా?'' అనుకుంది వర్ధనమ్మ.

''ఏమండీ! రోజూ మీరు నేను భాగవతం చదివితే వింటున్నారు. ఈ రోజు మీరు చదవండి. నేను వింటాను'' అంది భానుమూర్తి గారి వంక చూస్తూ.

''నీలా పద్యాలు రాగయుక్తంగా కమ్మని కంఠంతో పాడటం నాకు రాదు వర్ధనమ్మా! వచనంలో చదివేయమంటే చదివేస్తాను'' అన్నారు భానుమూర్తిగారు. అలాగే అన్నట్లు తల ఊపింది వర్ధనమ్మ.

భానుమూర్తిగారు పద్యాలు చదువుతూ ఉంటే ఇంటి కప్పు వంక అలాగే చూస్తూ శ్రద్ధగా వింటోంది వర్ధనమ్మ. మధ్య మధ్య కాస్త ఆపి 'వింటున్నదా? నిద్ర పోతున్నదా' అని తలయెత్తి ఆమె వంక చూస్తున్నారు భానుమూర్తిగారు. నాలుగు పద్యాలు కాగానే మరో సారి అలాగే నిశ్చలంగా ఉన్న ఆమె కనుగుడ్ల వంక చూసి ఏదో అనుమానంతో ఠక్కున ఆగిపోయారు భానుమూర్తిగారు.

''వర్ధనమ్మా!'' అని పిలిచారు.

సమాధానం లేదు. భుజం పట్టి కుదిపి చూశారు చలనం లేదు. భానుమూర్తిగారికి అకస్మాత్తుగా వళ్ళంతా చెమటలు పట్టింది. కాళ్ళల్లో వణుకు ప్రారంభం అయింది. ఏం చేయాలో తెలియని అయోమయావస్థలో పరుగులాంటి నడకతో తన ఇంటి వైపు బయల్దేరారు. ఆ వయసులో అంత వేగంగా చిన్న పిల్లాడిలా ఎలా నడిచాడో ఆయనకే అర్థం కాలేదు. గుమ్మంలోకి, అడుగుపెట్టగానే లోపల కొడుకు, కోడలు పడుతున్న ఘర్షణ, ఆయన చెవుల్లో పడింది. ''మీ నాన్నతో ఈ పాట్లు నేను పడలేను. అన్నేళ్ళు వచ్చాయి. మనిషికి బుద్ధి ఉండక్కర్లా? ఇక్కడ వేళకింత మెక్కి, వెళ్ళి అస్తమానం ఆ వర్ధనమ్మ ఇంట్లో కూర్చుంటున్నాడు. ఛీ! ఛీ! ఈ వయసులో ఇవేం పాడు బుద్ధులు. మా ఇంటావంటా లేవు. ఈయనకులేకపోయినా ఆ వర్ధనమ్మకైనా సిగ్గుండక్కర్లా?'' లోపలి నుండి బులెట్లలా దూసుకొచ్చిన మాటలు ఒక్కసారిగా గుండెల్లో జొరబడగా ఠక్కున అక్కడే ఆగిపోయారు భానుమూర్తిగారు. వచ్చిన పని, ఆ బాధ, ఆ దుఃఖం, వర్ధనమ్మ మరణం ఆ సమయంలో చాలా చిన్న విషయాలుగా అనిపించాయి.

''వర్ధనమ్మా! నా కన్నా నువ్వు అదృష్టవంతురాలివి. ఇలాంటి మాటలు నీ చెవిన పడక ముందే దాటి పోయావు' అనుకున్నారు తనలో తనే గొణుక్కుంటూ. ఇప్పుడు ఆయనకు వర్ధనమ్మ చనిపోయినందుకు కాక తను బ్రతికున్నందుకు ఏడుపొచ్చింది. **

## దర్శనీయ స్థలాలు



# గండికోట మాధవరాయస్వామి ఆలయం

నాటి ఆంధ్ర దేశములోని అరువదినాలుగు కోటల్లో అగ్రస్థానానాక్రమించిన కోట గండికోట. ఈ కోటను కాకతీయ ప్రభువైన మహాకాకతి మహారాజు క్రీ.శ. 1120లో ప్రారంభించి రెండేళ్ళ కాలంలో పూర్తి చేశాడు. ఇది కడప జిల్లాలోని జమ్మలమడుగు పట్టణానికి సమీపంలో ఎత్తైన ఎర్రమల కొండలపైన, పరవళ్లు త్రొక్కుతూ ప్రవహించే పవిత్ర పెన్నా నది తీరంలో వుంది. ఈ కోటను క్రీ.శ. 1509 లో విజయనగరాధీశుడైన శ్రీకృష్ణ దేవరాయలు స్వాధీనం చేసుకొని, అక్కడో వైష్ణవ ఆలయాన్ని నిర్మింపజేశాడు. ఆదే ''శ్రీ మాధవ రాయస్వామి ఆలయం'' ఈయన వైష్ణవుడవడము చేత తిరుమల నుండి, మూడు వందలమంది వైష్ణవ పూజారులను రావించి, మడి మాన్యాలు ఏర్పాటు చేసి, ఆలయ ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు.

ఈ ఆలయము పెద్ద ఆవరణలో ఎత్తైన ప్రహరీల మధ్య రాతితో నిర్మించారు. ముఖ ద్వారముపైన ఐదంతస్తుల రాజగోపురముంది. లోన గర్భగుడి కెదురుగా శిల్పకళావిన్యాసానికి మచ్చుతునకగా చెప్పబడే రంగ మండపముంది. ఈ మండపము 32 స్థంభాలపై, ఎత్తయిన వేదికపై నిర్మింపబడివుంది. ఇందలి ప్రతి స్థంభముపైన సింహశరభాది మృగములను అత్యంత రమణీయంగా చెక్కారు. ప్రతి స్థంభముపైన ఒక దేవతామూర్తి విగ్రహాన్ని మలచారు. పై కప్పుపై చెక్కిన శతపత్ర పద్మం, ఇతర డిజైనులు చూపరుల నాకర్షించి ఆకట్టుకుంటాయి.

ప్రవేశద్వారం దాటిన వెంటనే ద్వారాలకిరువైపులా జలకన్యల ప్రతిమలు జనులకు స్వాగతం పలుకుతాయి. చుట్టూ శిలా నిర్మితమైన వరండా వంటి కట్టడము, స్థంభాల వరుసవున్నాయి. నాలుగు వందల ఏళ్లు గడిచినా చెక్కు చెదరని శిల్ప కళానిధి ఈ మాధవరాయస్వామి ఆలయము.

కాలగమనములో కొన్నేళ్లు గడిచిన తరువాత 1584లో ఈ కోట గంగరాజు పాలనక్రిందకు వచ్చింది. ఆయన అంత సమర్థుడు కాకపోవడం చేత, గోలుకొండ పాలకుడైన మీర్‌జుమ్లా గండికోటను వశపరచుకున్నాడు.

మూలవిరాట్టు శ్రీ మాధవరాయుని లోహ విగ్రహాన్ని మరి యితర ప్రతిమలను, కలశాలను కరిగించి ఫిరంగులు చేయతలపెట్టగా, మాధవరాయుని విగ్రహం ఎంతకరిగించినా కరగలేదట. ఆ విగ్రహానికి వాడిన మిశ్రమలోహమేమిటో ఇప్పటికీ ఎవ్వరికీ అంతు పట్టడం లేదు. ఆ విగ్రహం ఈనాడు ఆలయాన్ని



ఆలయంలోని శిలాస్థంభంపై ఉన్న శ్రీ మహావిష్ణువు

విడిచి, మైదుకూరు ప్రాంతములోనున్నట్లు చెబుతారు.

ఈ ఆలయము పర్యాటకులను అమితంగా ఆకర్షించినా, తగినంత రవాణా సౌకర్యాలు లేనందున యాత్రీకులు, పర్యాటకులు యిబ్బందులకు గురికాక తప్పడం లేదు. ఈ విషయంలో ప్రభుత్వము తగిన చర్యలు తీసుకోవాలి.

ఏ.విజయలక్ష్మీరెడ్డి